# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సాంకేతికతను వినియోగించి రాష్ట్రంలో రహదారుల నిర్మాణాలు, మరమ్మతులను తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- ❖ రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే ఔత్సాహికులకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందింస్తుందని మంత్రి కొలుసు పార్ధసారథి తెలిపారు.

- ❖ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని జులై 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.

- ❖ తల్లికి వందనం పథకంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

==============================

మెరుగైన సాంకేతికతను వినియోగించి రాష్ట్రంలో రహదారుల నిర్మాణలు, మరమత్తులు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో రహదారులు, భవనాల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రహదారుల దుస్థితి, నిధుల అవసరం, ప్రస్తుతం ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న రహదారులను బాగుచేసే ప్రక్రియ తక్షణమే మొదలు పెట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో 7 వేల 087 కిలోమీటర్ల పరిధిలో తక్షణం పనులు చేపట్టాల్సి ఉందని, వీటి కోసం కనీసం 300 కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. టెండర్లు పిలిచి అత్యవసర పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

==============================

పనికిరాని వ్యర్ధాలతో సంపద సృష్టించడంతో పాటు, లక్షలాది మందికి ఉపాధి కల్పించవచ్చని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈరోజు తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో ఘన, ద్రవ వ్యర్ధాల నిర్వహణకు అనుసరించాల్సిన విధానాలు, వాటి నుంచి ఎటువంటి ఉత్పత్తులు సాధించవచ్చు అనే అంశాలపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఘన వ్యర్ధాలను 12 గంటల్లోపు సేకరించగలిగితే సంపద వస్తుందని, వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టాలన్నారు. దీనిని ముందుగా

పిఠాపురం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపడతామని, దానిలో వచ్చిన ఫలితాలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టడంపై ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుందని గృహనిర్మాణం, పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈరోజు విజయవాడలో జరిగిన ఫుడ్ ప్రాసెసింగ్ పారిశ్రామిక వేత్తల సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి మందగించిందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తల సమస్యలను పరిష్కరించడానికి ఈ సమావేశం దోహదపడుతుందని, పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటూ... అవసరమైన సహాయ సహకారాలు అందింస్తుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు పెరుగుతుండటంతో ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారని, అలాగే ప్రభుత్వం కూడా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించిందని మంత్రి పేర్కొంటూ.....

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

"తల్లికి వందనం" పథకంపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ఇప్పటి వరకూ, ఎటువంటి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయలేదని స్పష్టం చేశారు. ఆధార్ చట్టం 2016 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల పథకాల లబ్దిదారులను గుర్తించేందుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉందని తెలిపారు. అనంతరం ఆధార్ ప్రాధికార సంస్థ నుంచి కావాల్సిన అనుమతులు వస్తాయన్నారు. దీనికి అనుగుణంగానే కమిషనర్, పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలతో ఆధార్‌ను వినియోగించేలా గెజిట్ పబ్లికేషన్ జారీ అయిందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిర్దేశించిన ధరల కన్నా అధిక రేట్లకు భక్తులకు వస్తువులను విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) జె. శ్యామలారావు హెచ్చరించారు. తిరుమలలో ఈరోజు టిటిడి దేవాదాయ శాఖ అధికారులతో కలిసి వరాహస్వామి విశ్రాంతి భవనం, ప్రధాన షాపింగ్ కాంప్లెక్స్‌లోని, పునరావాస కేంద్రంలోని నిర్వాసిత గృహాలను, దుకాణాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిర్దేశించిన ధరల కన్నా అధిక ధరలకు వస్తువులను విక్రయించడాన్ని గమనించిన ఈఓ మరోసారి అధిక ధరలకు వస్తువులను విక్రయించినట్లయితే ఆ షాపుల లైసెన్స్ లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీకాకుళం జిల్లాలో అంటు వ్యాధులు ప్రబలకుండా వుండేందుకు ముందస్తు చర్యలు చేపట్టామని శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. ఈరోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ... జూన్ నుండి అక్టోబరు నెల వరకు అంటు వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున, వీటి నియంత్రణకు వివిధ శాఖలను సమన్వయం చేసుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో క్లోరినేషన్ చేపట్టి... పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని ఆమె స్పష్టం చేశారు. అతిసారం ఇతర అంటు వ్యాధుల నివారణకు రాపిడ్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేశామని, ఇంటింటి సర్వే చేపట్టి అంటు వ్యాధులు సోకిన వారికి సకాలంలో చికిత్స అందిస్తుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 23 నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం అమలు దస్త్రంపై మంత్రి తొలి సంతకం చేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రతి రైతు ఆత్మగౌరవంతో బతకాలనేదే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలనీ సూచించారు. ప్రతి మంగళ, బుధవారాలు వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తారని మంత్రి వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర కోస్తా తీరం మీద ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే బంగాళాఖాతంలో ఉన్న మరో ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తాలో పలు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణా సంస్థ హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈరోజు డ్రై డే సందర్భంగా కలెక్టర్ బంగ్లా రోడ్డు, తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భూ పరిపాలన వ్యవహారాల నిర్వహణతో పాటు, సుపరిపాలన అందించే దిశగా ముందడుగు వేయాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈరోజు అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోలు తహసిల్దారులతో నిర్వహించిన సమావేశంలో భూ పరిపాలన, పౌర సేవలు, పెండింగ్ సమస్యల అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూపరిపాలన వ్యవహారాలు పర్య వేక్షించే ముఖ్యమైన వ్యవస్థ రెవెన్యూ అని, భూ పన్నులు ద్వారా సంక్రమించే ఆదాయాన్ని సక్రమంగా పర్యవేక్షించాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ గా ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈరోజు విజయవాడలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఐ అండ్ పీఆర్ అధికారులతో సమావేశమై శాఖాపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖకు డైరెక్టర్ గా రావడం ఆనందంగా ఉందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =